క్లుప్తంగా

ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్‌గా మధు



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా చిన్న గూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన పట్ల మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ మంగళవారం తెలిపాడు.

సైకిళ్ల పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి, టౌన్ ఎస్సై అరుణ, క్లబ్ చాప్టర్ అధ్యక్షుడు మాలే నాగేశ్వర్‌రావు, క్లబ్ అధ్యక్షుడు నాగేందర్‌రావు, సెక్రటరీ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కేసముద్రం: మండలంలోని బేరువాడ గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కాంగ్రెస్ నాయకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ రూ.18,018 విరాళంగా మంగళవారం ఆలయ నిర్వాహకులకు అందజేశాడు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు ప్రవీణ్‌కుమార్, రాజేందర్, బీముడు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

మహబూబాబాద్ రూరల్: ఖమ్మం జిల్లా ఇల్లెందు మున్సిపాలిటీ అవిశ్వాస తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్లపై జరిగిన దాడి, కిడ్నాప్ సంఘటనలో దోషులను అరెస్ట్ చేయాలని కోరుతూ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ మంగళవారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు.

టౌన్ సీఐకి అభినందనలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌ను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు నాళ్ల లక్ష్మీనరసింహారావు, గిరిధర్ గుప్తా, జంగాల సదాశివుడు, సతీష్, సతీష్ పాల్గొన్నారు. పట్టణానికి చెందిన వ్యాపారులు ఉమాశంకర్, జ్ఞానేశ్వర్, రవిశంకర్ సీఐని సత్కరించి అభినందనలు తెలిపారు.

జామాయిల్‌తోట దగ్ధం



బయ్యారం: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని జామాయిల్‌తోట దగ్ధమైన సంఘటన మంగళవారం బయ్యారంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని చల్లగుండ్ల వెంకటనారాయణ, వెంకటేశ్వరరావు ఏడు ఎకరాల్లో జామాయిల్ సాగు చేశారు. కాగా మధ్యాహ్నం తోటనుంచి మంటలు రావడాన్ని స్థానికులు గమనించారు. పక్కనే ఉన్న ఊర్లోకి మంటలు వచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన స్థానికులు అగ్నిమాపక, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో తోట వద్దకు చేరుకుని అగ్నిమాపక వాహన సిబ్బందితో పాటు పోలీసులు, స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రైతులకు ఆస్తినష్టం వాటిల్లింది.

ప్రశాంతంగా ఓపెన్ డిగ్రీ పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ తృతీయ సంవత్సరం ఐదో సెమ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమైనట్లు అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ కోఆర్డినేటర్ చిత్తనూరి మల్లేశం తెలిపాడు. అన్ని గ్రూపులు కలుపుకొని 141 మంది విద్యార్థులకు 134 మంది పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నాడు. అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లకు చివరి తేదీ ఈనెల 29 వరకు ఉందన్నాడు. రూ.200 రుసుముతో మార్చి 31వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

కురవి: మండల కేంద్రంలో మార్చి 8వ తేదీ నుంచి జరిగే జాతరకు వచ్చే భక్తులకు అంతరాయం కలిగించవద్దని తహసీల్దార్ సునీల్ రెడ్డి, ఎస్సై గోపి అన్నారు. మంగళవారం కురవి గుడి సెంటర్ వద్ద షాపుల యజమానులకు నోటీసులను అందజేశారు. రోడ్డు పక్కన ఇరువైపులా ఉన్న షాపులు రోడ్డు మీదకు వస్తున్నాయని, వాటిని దూరంగా పెట్టుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘుపతిరెడ్డి, కార్యదర్శి దివాకర్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం

తొర్రూరు: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్ర పోస్టర్లను మంగళవారం డివిజన్ కేంద్రంలో ఆవిష్కరించారు. సంకల్ప యాత్ర మార్చి 1న పాలకుర్తి నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందన్నారు. అదే రోజు తొర్రూరులో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ అధ్యక్షుడు పల్లె కుమార్, నాయకులు ఝాన్సీ, రవిబాబు, యాకయ్య, రాజేష్, శేఖర్, భరత్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

డోర్నకల్: డోర్నకల్‌లో బుధవారం జరిగే బీజేపీ ప్రజా సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ ప్రభారి బేజారి బీరప్ప తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. డోర్నకల్ పట్టణం నుంచి ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గాంధీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్, బైపాస్ రోడ్డు వరకు రోడ్‌షో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సంగీత, నాయకులు గాదె రాంబాబు, కనకం పెంటయ్య, బాసాని నాగేశ్వర్‌రావు, దేవా, రెహమాన్, జయరాజ్, గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

పెద్దవంగర: బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పాలకుర్తి నియోజకవర్గ కో కన్వీనర్ సుంకరనేని కోటేశ్వరరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, వడ్డెకొత్తపల్లి ఎంపీటీసీ ఝాన్సీరవి, జిల్లా నాయకులు తలారి సోమయ్య, భాస్కర్, ముఖేష్, రాము, శంకర్, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు రూరల్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



డోర్నకల్: మాట్లాడుతున్న బీరప్ప



పెద్దవంగర: మాట్లాడుతున్న కోటేశ్వరరావు

సుపరిపాలన అందించడమే ధ్యేయం

● ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

నర్సింహులపేట: ప్రజలకు మంచి పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశాడు. అనంతరం ఆయన మట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిక మెజార్టీ కోసం ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేయాలన్నారు. ఆకేరు వాగులోకి వర్ధన్నపేట చెక్ డ్యాం నుంచి నీటిని విడుదల చేయాలని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. అనంతరం నాయకుడు గుగులోతు బాబురావు ఆధ్వర్యంలో 50మంది కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనువాస్, ఎంపీఓ సోమ్‌లాల్, వైస్ ఎంపీపీ దేవేందర్, ఎంపీటీసీ రమేష్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

పథకాలు లబ్ధిదారులకు చేరేలా కృషి చేయాలి

చిన్నగూడూరు: ప్రభుత్వ పథకాలను అసలైన లబ్ధిదారులకు చేరేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీనియర్ నాయకుడు రావుల రాంరెడ్డి నివాసంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ కట్టడాల నిర్మాణాలకు, సొంత ఇళ్లు నిర్మించుకునే వారికి రెవెన్యూ శాఖ అనుమతి ఇచ్చి పర్యవేక్షించాలని సూచించారు. ఇసుక, రేషన్ బియ్యం, నల్లబెల్లం, అక్రమవ్యాపారాలను అరికట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, తహసీల్దారు మహబూబ్‌అలీ, వైస్‌ఎంపీపీ పిల్లి వీరన్న పాల్గొన్నారు. తెలంగాణ పల్లె దవాఖాన, ఆయుర్వేదిక మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.కరుణాకర్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.



నర్సింహులపేట: చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

ముగిసిన ప్రజావేదిక

డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న 14వ ఉపాధి పనుల ప్రజావేదిక మంగళవారం ముగిసింది. 2022 ఏప్రిల్ 1నుంచి 2023 మార్చి 31 వరకు రూ.6,68,27,443 ఉపాధి నిధులు, రూ.1,63,38,802 పంచాయతీరాజ్ నిధులు కలిపి రూ.8,31,66,245 నిధులతో చేపట్టిన పనులపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించి ప్రజావేదికలో సమీక్షించారు. లోపాలను గుర్తించి ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు రికవరీ పేరుతో రూ.2,14,058 జరిమానా విధించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ శాంతకుమారి, అంబుడ్స్‌మెన్ ఆధాన్, విజిలెన్స్ అధికారి యాకూబ్, ఎంపీడీఓ మంగీలాల్, ఏపీఓ పార్థసారధి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, వివిధ ప్రభుత్వ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణను అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జ్ అధికారి బాలరాజు మంగళవారం తెలిపారు. నేటినుంచి మార్చి 6వ తేదీ వరకు టీఎస్ స్టడీ సర్కిల్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 95428 34507 ఫోన్ నంబర్‌ను, మానుకోట జిల్లా షెడ్యూల్డ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మాదిగలకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న రమేష్

మరిపెడ/మరిపెడ రూరల్: కేసముద్రం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో మాదిగలకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్ మాదిగ డిమాండ్ చేశాడు. మండలం కేంద్రంలో ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి మాదిగ, జినుక స్వామి అధ్యక్షతన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్ కమిటీల్లో ఇంత కాలం ఉన్నత వర్గాలకు తప్ప దళితులకు చోటు కల్పించలేదన్నాడు. 20ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకొని పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన దళితలకు మార్కెట్ కమిటీలతోపాటు స్థానిక సంస్థల పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంక ప్రమోద్, సీమ సురేష్, వంగూరి వెంకటేశ్వర్లు, బాషిపంగు రవికాంత్, శాగంటి ప్రశాంత్, రమేష్, యాకన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



మహబూబాబాద్ రూరల్: ఉపాధ్యాయులతో విద్యార్థులు



తొర్రూరూ రూరల్: అరిపిరాలలో..



మరిపెడ రూరల్: గాలివారిగూడెం యూపీఎస్‌లో..

మహబూబాబాద్ రూరల్/తొర్రూరు రూరల్/మరిపెడ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



బెల్లం, పటికను చూపిస్తున్న ఎస్సై సతీష్

నర్సింహులపేట: మండలంలోని రామన్నగూడెం, జయపురం క్రాస్ రోడ్డు వద్ద 30 క్వింటాళ్ల నల్లబెల్లం, 2క్వింటాళ్ల పటికను పట్టుకున్నట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా, టాటా హెక్సన్ వాహనం రోడ్డుకు దూరంగా అనుమానంగా కన్పించడంతో వెంటనే తనిఖీ చేయగా అందులో బెల్లం, పటిక ఉన్నట్లు గుర్తించామన్నారు. నిందితులు మండలంలోని దాసు తండాకు చెందిన గుగులోతు వీరన్న, గుగులోతు హేమ, గుగులోతు శ్రీనులుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చిత్తూరు నుంచి వాహనాల్లో బెల్లంను తీసుకువచ్చి తండాల్లో అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. రూ.3.20లక్షల బెల్లం, పటికను సీజ్ చేసి వాహనం జప్తు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీలు రవి, రమేష్, విజయ్, యాకయ్య, సిబ్బంది సురేష్, సుమంత్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు సమీపంలోని తాగునీటి బావి, బోరుబావులను మంగళవారం మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ అహ్మద్ పాల్గొన్నారు.

నేటి బాలలే భవిష్యత్ ఆవిష్కర్తలు

● డీఈఓ రామారావు



ఆవిష్కరణలను పరిశీలిస్తున్న డీఈఓ

పెద్దవంగర: నేటి బాలలే రేపటి దేశ భవిష్యత్ ఆవిష్కర్తలు అని డీఈఓ రామారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ ఎగ్జిబిషన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. పలు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను డీఈఓ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టెక్నాలజీతో విద్యార్థులు పోటీ పడాలన్నారు. గౌరవ అతిథిగా వరంగల్ నిట్ ప్రొఫెసర్ దినకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని, సైన్స్‌పై ప్రయోగాలు చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో లయన్ డాక్టర్స్ చంద్రశేఖర్ ఆర్య, తమ్మెర లక్ష్మీనర్సింహారావు, వేలూరి శారద, ఎంఎన్ఓ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సురేష్, మల్లికార్జున్, రేణుక, స్రవంతి, వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సూర్యనారాయణ

మరిపెడ రూరల్: ఆయిల్‌పాం సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి, రైతులు అధిక దిగుబడి పొందాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి కె.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్లంపేటలో ఆయిల్‌పాం సాగుపై ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చీడపీడలు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మార్కెట్, రవాణా, కాత విషయంలో రైతులు ఆచరించాల్సిన పద్ధతులను వివరించారు. ఉత్సాహం ఉన్న రైతులు ఆయిల్‌పాం సాగుకు ముందుకు రావాలని సూర్యనారాయణ కోరారు. అనంతరం ఉద్యాన అధికారి అనితశ్రీ మాట్లాడుతూ.. బిందు సేద్య నిర్వహణ, మొదటి రెండు సంవత్సరాలు లేత తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె రైతులకు వివరించారు. కార్యక్రమంలో బిందు సేద్య ప్రతినిధులు ప్రసాద్‌బాబు, డీలర్ తాడూరి వీరన్న, కంపెనీ ప్రతినిధులు, ఫీల్డ్ ఆఫీసర్స్ ఎల్లయ్య, శివకుమార్, నగేష్, పున్నం చందర్, రైతులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

కేసముద్రం: విద్యుత్ అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని విద్యుత్‌శాఖ డీఈ విజయ్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో ఇనుగుర్తి, కేసముద్రం మండలాలకు చెందిన విద్యుత్ ఉద్యోగులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు అంతరాలు లేని విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. గృహజ్యోతి పథకాన్ని అర్హులకు అందేలా చూడాలన్నారు. అనంతరం మానుకోట సర్కిల్‌లో గృహజ్యోతి డేటా ఎంట్రీలో ముందుగా నిలిచినందుకు గాను కేసముద్రం, ఇనుగుర్తి ఏఈలు రాజు, శశిధర్‌లను డీఈ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాసులు, ఏఏఓ ఎం.రమేష్, ఏఈలు శశిధర్, రాజు, సబ్ ఇంజనీర్ కరుణాకర్, పాల్గొన్నారు.

వార్డుకు రూ.5లక్షలు కేటాయించాలి



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల అభివృద్ధికి ప్రతివార్డుకు రూ. 5లక్షలు కేటాయించాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, 36వ వార్డు కౌన్సిలర్ బి.నీరజరెడ్డి ధర్మన్న అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం వారు మాట్లాడారు. మున్సిపల్ తీర్మానం లేకుండానే జనరల్ ఫండ్ నిధులు కాంట్రాక్టర్లకు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.వంద కోట్ల నిధుల్లో రూ.35కోట్లు మాత్రమే ఇచ్చారని దీనికి అధికార పాలకపక్షమే బాధ్యత వహించాలన్నారు. నిధుల విడుదలకు నాటి బీఆర్ఎస్ పాలకపక్షం చర్యలు తీసుకోకపోగా సీపీఐ ప్రాతినిధ్య వార్డులకు కేటీఆర్ కేటాయించిన నిధులను కూడా రాకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. మున్సిపాలిటీలో జరుగుతున్న నిర్ణయాలిన్నింటిపై సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు.

సంక్షిప్త సమాచారం

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

గూడూరు: పదో తరగతి వార్షిక పరీక్షలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మండల ప్రత్యేక అధికారి ఎం.ఎర్రయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థినులకు పది పరీక్షలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం సుజాత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

చిన్నగూడూరు: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ విలీన మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ బండపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండంలోని గుండంరాజ్‌పల్లి గ్రామంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పెద్దవంగర: మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి కుమార్ యాదవ్ మంగళవారం తనిఖీలు నిర్వహించాడు.

పాలాభిషేకం

తొర్రూరు/పెద్దవంగర: గృహజ్యోతి, రూ.500 గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రభుత్వం ప్రారంభించిన సందర్భంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుంచు సంతోష్, ముద్దసాని సురేష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్ కౌన్సిలర్లు భూసాని రాము, తూనం రోజా, నర్కుటి గజానంద్, నాయకులు శ్రీనివాస్, అచ్చిరెడ్డి, సంజీవ, మహేందర్, సోమన్న, రవినాయక్ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

కేసముద్రం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (బుధవారం) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వివేకరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చైర్మన్ పదవికి దరఖాస్తు

మహబూబాబాద్ రూరల్: జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసినట్లు మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్ మంగళవారం తెలిపాడు.

బస్టాండ్‌ను పరిశీలించిన డిపో మేనేజర్

కురవి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ మేడ శివప్రసాద్ మంగళవారం పరిశీలించారు. కురవిలో మార్చి 8వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో భక్తులకు బస్సు సర్వీసులను నడిపేందుకు అవసరమైన స్థలాలను ఆయన పరిశీలించారు.

ట్రాఫిక్ విభాగానికి సుమో కేటాయింపు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పర్యవేక్షణకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు నూతనంగా సుమో వాహనాన్ని కేటాయించగా మంగళవారం ట్రాఫిక్ ఎస్సై శ్యాంసుందర్ వాహనం ద్వారానే విధులు నిర్వహించాడు.

సైన్స్ ఎగ్జిబిషన్

గార్ల: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతో దోహదపడుతుందని ప్రిన్సిపాల్ జైస్ అన్నారు. మంగళవారం గార్లలోని నిర్మలా హైస్కూల్లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఫాదర్ దిలీప్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ శలెట్, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సినీ, సిస్టర్స్ రోస్మిన్, జెర్లిన్, జీనా పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్/బయ్యారం: నేటినుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాల్లో వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. ఒక నిమిషం ఆలస్యం నిబంధన ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరాడు. ఈ సమావేశంలో మనోజ్, వరుణ్, జైపాల్, భరత్ పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్: కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం హోమియోపతి వైద్యుడు పరికిపండ్ల అశోక్‌ను అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి ఘనంగా సన్మానించారు. ఇటీవల హోమియోపతి వైద్యుల సంఘం జాతీయ సదస్సులో అశోక్‌కు జాతీయ అవార్డు ప్రదానం చేసిన సందర్భంగా సన్మానించారు.

సేవాలాల్ జయంతి వేడుకలు

గార్ల: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను మంగళవారం పెద్దకిష్టాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత అధికారి గంగావత్ రాంసింగ్‌నాయక్, చెన్నానాయక్, హరిప్రసాద్, మూన్యానాయక్, శంకర్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కేసముద్రం: ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీష్, పీఆర్ ఏఈ మానస, గ్రామ అధ్యక్షుడు జనార్దన్, శ్యాం, శోభన్, మంగ్యానాయక్ పాల్గొన్నారు.

కాల్వ పరిశీలన

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల 60 డీడీఎల్, 7డీబీఎల్ ఉపకాల్వను ఎస్సారెస్పీ ఈఈ సమ్మిరెడ్డి మంగళవారం పరిశీలించాడు. డీబీఎల్ ఉపకాల్వ నుంచి నెల్లికుదురు మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి పెద్దచెరువు, ఆకేరువాగు చెక్‌డ్యాంలు నింపుతామన్నారు. నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ, జయపురం, తదితర ఆకేరు వాగు పరివాహక ప్రాంతాల్లో సాగు నీరందించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నాడు.

బియ్యాల జనార్దన్‌రావుకు నివాళి



మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు డాక్టర్ బియ్యాల జనార్దన్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్స్ శంకర్, శ్రీపాల్‌రెడ్డి, అధ్యాపకులు ముత్తయ్య, రమేష్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జనార్దన్‌రావు వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్, మోకాళ్ల శ్రీనివాస్‌రావు, వీరస్వామి, బద్రి నాయక్ పాల్గొన్నారు.